క్లుప్తంగా

అయ్యప్ప ఆలయంలో ఉత్తరానక్షత్ర పూజలు



ఆలయ సహపంక్తి భోజనం చేస్తున్న భక్తులు

నగరి : పట్టణ పరిధిలోని బైపాస్ కూడలి సమీపం గల శ్రీ ధర్మశాస్తా అయ్యప్ప స్వామి ఆలయంలో బుధవారం ఉత్తరా నక్షత్ర పూజలు వైభవంగా నిర్వహించారు. అయ్యప్ప పాటల భజనలు, అర్చన మంత్రాలను అధిక సంఖ్యలో అయ్యప్ప భక్తులు ఉచ్చరిస్తూ భజనలు చేయడంతో ఆలయ ప్రాంగణంలో పండగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా ఆలయంలో భక్తులకు సహపంక్తి భోజనం పెట్టారు. భక్తులు కస్తూరి, చంద్రశేఖర్, అరుణ, మునస్వామి ఉభయదారులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో గురుస్వామి మురళి, భక్తులు కన్నప్ప, రమేష్ బాబు, దుర్గాప్రకాష్ స్వామి పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి ప్రభుత్వాల కృషి



మందులు పంపిణీ చేస్తున్న శాస్త్రవేత్త శ్రీనివాసులు

పుత్తూరు: రైతు సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పని చేస్తున్నాయని కేవీకే సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.శ్రీనివాసులు తెలిపారు. బుధవారం పుత్తూరు మండలం పైడిపల్లిలో రాస్ కృషి విజ్ఞానకేంద్రం ఆధ్వర్యంలో పీఎం కిసాన్ 16వ విడత నిధుల ప్రత్యక్ష ప్రసారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం నిర్వహిస్తున్న పీఎం కిసాన్, కిసాన్ క్రెడిట్ కార్డ్ స్కీమ్, భూసార పరీక్షాపత్రం స్కీమ్, నానో ఎరువుల వాడకం, ప్రకృతి వ్యవసాయం, డ్రోన్ సాంకేతిక కార్యక్రమాల గురించి వివరించారు. అనంతరం రైతులకు ఉచితంగా వ్యవసాయ మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు దివ్య, రాముకుమార్, ఏఓ కోదండయ్య, రైతులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీతో వైకల్యం నయం



ఫిజియోథెరపీ చేస్తున్న డాక్టర్ అనూష

పాలసముద్రం : అంగవైకల్యం కలిగిన పిల్లలకు ఫిజియోథెరపీ వ్యాయామంతోనే అంగవైకల్యం నయం చేసుకోవచ్చని ఎంఈఓలు రాజేంద్రప్రసాద్, గిరిజ తెలిపారు. పాలసముద్రం భవిత కేంద్రంలో ఫిజియోథెరపిస్ట్ అనూష ఏడుగురు అంగవైకల్యం కలిగిన పిల్లలకు ఫిజియోథెరపీ చేశారు. అనంతరం డాక్టర్ అనూష మాట్లాడుతూ ప్రతి బుధవారం శారీరకంగా, మానసికంగా ఇబ్బంది పడే పిల్లలకు భవిత కేంద్రంలో ఉచితంగా ఫిజియోథెరపీ సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. ఇలాంటి అవకాశాన్ని గ్రామీణ ప్రాంతాల్లో అంగవైకల్యం కలిగిన పిల్లల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఐఆర్‌టీ టీచర్లు బాలాజీ పాల్గొన్నారు.

ఆలయ ధర్మకర్త ఆకస్మిక మృతి



గంగాధర నెల్లూరు: గంగాధర నెల్లూరు మండలం వేపంజేరి గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీ నారాయణ స్వామివారి ఆలయ స్థాపకులు, ధర్మకర్త కె.ఎస్ శ్రీధర్ (81) బుధవారం ఆకస్మికంగా మృతిచెందారు. కుటుంబ సభ్యులు కేఎస్ వాసు, రవి, లత తెలిపిన వివరాల మేరకు.. అనారోగ్యంతో తిరుపతిలోని సిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కేఎస్ శ్రీధర్ బుధవారం మృతి చెందారని తెలిపారు. అంత్యక్రియలు వారి స్వస్థలం తిరుపతిలో శుక్రవారం జరుగుతాయన్నారు.

ప్రతి కూలీకి వంద రోజుల పని

విజయపురం : ప్రతి ఉపాధి కూలీకి వంద రోజులు పని కల్పించాలని ఎంపీడీఓ బ్రహ్మయ్య తెలిపారు. బుధవారం మండల కార్యాలయంలో ఎన్ఆర్ఈజీఎస్ పనులపై సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న వేసవిలో కూలీలకు నీడ ఏర్పాటు చేయాలన్నారు. రోజు వారి కూలి రూ.250 వచ్చేలా పని కల్పించాలని, తాగునీటి వసతి ఏర్పాటు చేయాలని సూచించారు.

గర్భిణులకు అన్నదానం

నగరి/పుత్తూరు : ప్రభుత్వ ఆస్పత్రికి వైద్య పరీక్షల నిమిత్తం వచ్చే గర్భిణులకు బుధవారం రోజా చారిటబుల్ ట్రస్టు ద్వారా ఉచితంగా పౌష్టికాహారం అందించారు. గర్భధారణ పరీక్షల సమయంలో ఆస్పత్రిలో ఉండాల్సి వచ్చే వారు భోజనానికి ఎలాంటి ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో ఉచిత భోజనం అందిస్తున్నారు. గర్భిణులు, బాలింతలతో పాటు వారి వెంట వచ్చే వారికి కూడా ఉచితంగా వెజిటబుల్ రైస్, గుడ్డు, పుదీన చట్నీ, చిక్కీ, అరటిపండు, రైతాతో కూడిన ఆహారం అందించారు.

సైన్స్‌తోనే మానవ మనుగడ

- విజ్ఞాన శాస్త్రంతోనే సమాజ అభ్యున్నతి
- ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం
- ప్రయోగాల ప్రదర్శనకు పోటీపడిన విద్యార్థులు



నగరి: ముడిపల్లి పాఠశాలలో విద్యార్థుల ప్రదర్శనను పరిశీలిస్తున్న హెచ్‌ఎం

నగరి : ప్రయోగాత్మక విజ్ఞానం విద్యార్థుల మనస్సులో చెరిగిపోని ముద్ర వేస్తుందని, ప్రయోగాలు ప్రగతికి సోపానాలు అని ఎంఈఓ నమశ్శివాయం అన్నారు. నగరి మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో మంగళవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన మోడ్రన్ సిటీ, జూపార్క్, అగ్నిపర్వత నమూనాలు, బ్యాటరీ కార్లు, చిత్రపటాలు అందరినీ అలరించాయి. ప్రతి పాఠశాలలో తొలుత సీవీ రామన్ చిత్రపటానికి పూలదండలు వేసి నివాళులర్పించారు. ముడిపల్లి పాఠశాలల్లో విద్యార్థులు ఏర్పాటుచేసిన సైన్స్ ప్రదర్శనలో ఎంఈఓ నమశ్శివాయం పాల్గొన్నారు.

సైన్స్ మన జీవితంలో మిళితమై ఉంది

సైన్స్ మన జీవితంలో మిళితమై ఉందని ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వేణుగోపాల్ అన్నారు. బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని కళాశాలలో విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, ప్రయోగాల ప్రదర్శనలో పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. సమావేశంలో ఐక్యూ కోఆర్డినేటర్ ఇందిరా ప్రియదర్శిని, బోటనీ, ఫిజిక్స్, జువాలజీ, కెమిస్ట్రీ విభాగాలకు చెందిన అధ్యాపకులు సుబ్రమణ్యం, స్వాతి, అరుణ కుమారి, రమేష్, సుహాసిని, నవీన్, మునికుమారి, ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరులో..

పుత్తూరు: సమాజ అభ్యున్నతికి, సుఖశాంతుల కోసం విజ్ఞానశాస్త్రం ఉపయోగపడాలని స్థానిక ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.శ్రీనివాసులురెడ్డి అన్నారు. బుధవారం కళాశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని సర్ సి.వి.రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రిన్సిపల్ మాట్లాడుతూ భారత శాస్త్రవేత్త, నోబెల్ బహుమతి గ్రహీత సర్ సీవీ రామన్ కాంతి విక్షేపణ సిద్ధాంతాన్ని కనుగొన్న ఫిబ్రవరి 28న జాతీయ సైన్స్ డేని నిర్వహించుకుంటున్నట్లు తెలిపారు. నేటి ఆధునిక ప్రపంచంలో సైన్సు లేని జీవితాన్ని మనం ఊహించలేమన్నారు. ‘ప్రపంచ క్షేమం కోసం ప్రపంచ విజ్ఞానం’ అనేది మన భారత ప్రభుత్వ నినాదమని తెలిపారు. ప్రతి సైన్స్ విద్యార్థి ఒక శాస్త్రవేత్తగా ఎదిగి భారతదేశ కీర్తి ప్రతిష్టలను ప్రపంచానికి చాటిచెప్పాలని కోరారు. విద్యార్థులకు వివిధ పోటీలను నిర్వహించి, విజేతలుగా నిలిచిన కె.ఎం.రోహిత, ఏ.సలోమి, ప్రసన్నలక్ష్మి, చంద్రికకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ వీరయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విజయపురంలో..

విజయపురం: సైన్స్‌తోనే మానవ మనుగడ సాధ్యమని హెచ్‌ఎం సోమశేఖర్ అన్నారు. బుధవారం విజయపురం మండలం శ్రీహరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్లస్టర్ స్థాయిలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన సైన్స్ నమూనాలను, వర్కింగ్ మోడల్స్‌ను ప్రదర్శించారు. విజేతలైన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



నింద్రలో ..

నింద్రలో..

నింద్ర: మండల కేంద్రమైన నింద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రయోగాల మేళా నిర్వహించారు. స్థానిక ఎంపీపీ దీప పాల్గొని విద్యార్థులు ఏర్పాటు చేసిన నమూనాలను పరిశీలించారు. మంచి ప్రదర్శనలు చేసిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఎంఈఓ వసుమతి, శ్రీధర్ రాజు, హెచ్‌ఎం శివయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



నగరి: సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్



పుత్తూరు: మాట్లాడుతున్న ప్రిన్సిపల్ శ్రీనివాసులురెడ్డి



శ్రీహరిపురంలో సైన్స్ ప్రదర్శనను తిలకిస్తున్న ఉపాధ్యాయులు

శాస్త్రవేత్తలే నిజమైన దేవుళ్లు



కార్వేటినగరం: విద్యారులు రూపొందించిన ప్రయోగాలను పరిశీలిస్తున్న హెచ్‌ఎం



కార్వేటినగరం బాలికల ఉన్నత పాఠశాలలో

కార్వేటినగరం: శాస్త్రవేత్తలే నిజమైన దేవుళ్లని, ప్రతి మనిషి జీవితంలో విజ్ఞాన శాస్త్రం ఒక భాగమైందని, శాస్త్రవేత్తల కృషి అమూల్యమని కత్తెరపల్లి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం హేమారెడ్డి, బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం గాయత్రీదేవీ అన్నారు. బుధవారం శాస్త్రవేత్త సీవీ రామన్ జయంతి సందర్భంగా జాతీయ సైన్స్ దేను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో విద్యార్థులు ఏర్పాటు చేసిన ప్రయోగాలను పరిశీలించారు. డీఎం పురం ఉన్నత పాఠశాలలో విద్యార్థులు హెచ్‌ఎం కేశవులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సైన్స్ డే అక్షరాలు చూపరులను ఆకర్షించాయి. కార్యక్రమంలో ఆయా పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పలువురు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో..

కార్వేటినగరం: ప్రపంచంలో జరిగే ప్రతి పని పని కూడా సైన్స్‌తో ముడిపడి ఉందని ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయులురెడ్డి అన్నారు. బుధవారం కళాశాలలో జాతీయ సైన్స్ డేను ఘనంగా జరుపుకున్నారు. అనంతరం ఫిజిక్స్ విభాగాధిపతి బాలసుబ్రమణ్యంఆచారి ఏటా ఫిబ్రవరి 28న జాతీయ సైన్స్‌దినోత్సవం జరుపుకోవడం జరుగుతోందన్నారు.

గంగాధర నెల్లూరులో..

గంగాధర నెల్లూరు: నేటి విద్యార్థులే రేపటి శాస్త్రవేత్తలని ఎంఈఓ ఆంజనేయులు శెట్టి అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం హేమలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



డీఎంపురంలో సైన్స్‌డే అక్షరాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

శ్రీరంగరాజపురంలో..

శ్రీరంగరాజపురం: సైన్స్‌తోనే మానవ మనుగడ సాధ్యమని ఎంఈఓ అరుణాచలరెడ్డి అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం మండలంలోని అన్ని పాఠశాలల్లో సైన్స్‌డేను జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన ప్రయోగాలు, నమూనాలను పరిశీలించి ప్రతిభ చూపిన వారికి స్థానిక సర్పంచ్ వరదమ్మ బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 సబర్మతి, హెచ్‌ఎం ప్రసన్న, మాజీ సర్పంచ్ సుబ్బానాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాలసముద్రంలో..

పాలసముద్రం : మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించిన విద్య, వైజ్ఞానిక ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఎంఈఓలు రాజేంద్రప్రసాద్, గిరిజ మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్య సాధన కోసం పాటుపడాలన్నారు. కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



జీడీనెల్లూరు: సైన్స్‌ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న ఎంఈఓ



శ్రీరంగరాజపురం: బహుమతుల ప్రదానం

పల్స్‌పోలియోను విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ లత

కార్వేటినగరం: పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రభుత్వం చేపట్టే పల్స్‌పోలియోను విజయవంతం చేయాలని ఎంపీపీ లత అన్నారు. బుధవారం మండల అభివృద్ధి కార్యాలయంలో వైద్యసిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లకు ఎంపీడీఓ సుధాకర్ నాయుడు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ లత మాట్లాడుతూ 0-5 సంవత్సరాలలోపు చిన్నారులను విధిగా గుర్తించి మార్చి 3, 4, 5 తేదీల్లో మూడు రోజుల పాటు జరిగే పల్స్‌పోలియోలో రెండు చుక్కలు వేయించాలని సూచించారు. అదేవిధంగా బస్టాండ్లు, వలస కూలీలు, ఇటుక బట్టీల్లో పనిచేసే కార్మికుల పిల్లలను గుర్తించి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేసుకునేలా చూడాలన్నారు. అనంతరం వైద్యాధికారి హేమశ్రీ మాట్లాడుతూ మండలంలో 35 పల్స్‌పోలియో కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ విజయకుమార్, అంగన్‌వాడీ పర్యవేక్షకులు ఇందిరా, షామిని, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయాన్ని రైతులకు చేరువ చేయండి



రైతులతో చర్చిస్తున్న డీపీఎం వాసు

నగరి : సేంద్రియ వ్యవసాయాన్ని రైతులకు చేరువ చేయాలని ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వాసు సూచించారు. బుధవారం నగరి, నింద్ర మండలాల్లో సేంద్రియ పద్ధతిలో సాగులో ఉన్న పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ రసాయనాలు లేని సేంద్రియ ఉత్పత్తుల విలువను ప్రజలు తెలుసుకుంటున్నారని తెలిపారు. సేంద్రియ పంటలకు డిమాండ్ పెరుగుతూ ఉందన్నారు. రైతులను ఈ పద్ధతిలో ప్రోత్సహించాలన్నారు. సేంద్రియ పద్ధతిలో సాగు చేసే వేరుశనగను తిరుమల తిరుపతి దేవస్థానం వారిచే కొనుగోలు చేయించేందుకు చర్చలు జరుగుతున్నాయన్నారు. ప్రజలకు ఆరోగ్యాన్ని అందించేందుకు సేంద్రియ పంటల సాగు విస్తీర్ణం పెంచేందుకు సిబ్బంది కృషి చేయాలన్నారు.

ఘనంగా టైలర్స్ డే




మాట్లాడుతున్న మురగారెడ్డి

పుత్తూరు: జగనన్న చేదోడు పథకం తమకు ఎంతో ఉపయుక్తంగా ఉందని స్థానిక శ్రీలక్ష్మీవినాయక టైలర్స్ కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు భాస్కర్ అన్నారు. బుధవారం సొసైటీ ఆధ్వర్యంలో టైలర్స్ డేని ఘనంగా నిర్వహించారు. ముందుగా స్థానిక మండీవీధిలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించి, అంబేద్కర్ భవనంలో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సమాచార హక్కుల వేదిక కార్యదర్శి కె.మురగారెడ్డి మాట్లాడుతూ నేటి జగనన్న ప్రభుత్వం టైలర్ల దుస్థితిని గుర్తించి చేదోడుగా నిలవడం హర్షణీయమన్నారు. అనంతరం కల్యాణపురం వద్ద గల అనాథ వృద్ధాశ్రమంలోని మహిళలకు చీరలు పంపిణీ చేసి, భోజనం అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ ఉపాధ్యక్షుడు వెంకటముని, కార్యదర్శి రమేష్, ట్రెజరర్ గణేష్, డైరెక్టర్లు చిన్నబ్బ, మునస్వామిరెడ్డి, గోవిందన్‌యాదవ్, రాజేంద్ర, సూరి, మణి, ధనమ్మ, గీతాంజలి తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహకారం మరువలేనిది

నగరి : ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సహకారం మరువలేనిదని, జగనన్న చేదోడుతో ఆయన ఆదుకుంటున్నారని నగరి టైలర్ల సంక్షేమ సంఘ సభ్యులు తెలిపారు. బుధవారం ప్రపంచ టైలర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని సంఘసభ్యులు ఓంశక్తి ఆలయం నుంచి బస్టాండు ప్రాంగణం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్ష, కార్యదర్శులు అయూబ్ బాషా, వీరయ్య మాట్లాడుతూ జగనన్న చేదోడుతో టైలర్లను ఆదుకుంటున్న ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. సంఘ కార్యాలయం వద్ద కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షులు ఉమాపతి, ఉపకార్యదర్శి జగన్నాథం, కోశాధికారి కె.కృష్ణయ్య, సభ్యులు గణేష్, వరదరాజులు, నటరాజ్, హమీదు, హాతింబాయ్, రాజ, మునిరత్నం, శ్రీనివాసులు, నాగూరు, ధనరాజ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణల వైపు మొగ్గు చూపాలి



ప్రయోగాలను పరిశీలిస్తున్న డీఈఓ దేవరాజు

వెదురుకుప్పం: విద్యార్థులు నూతన ఆవిష్కరణల వైపు మొగ్గు చూపాలని జిల్లా విద్యాశాఖాధికారి దేవరాజు అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ఆయన వెదురుకుప్పం జెడ్పీ హైస్కూల్‌ను సందర్శించి వైజ్ఞానిక మేళాను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థిలో పోటీతత్వం ఉండాలన్నారు. మేధో వికాసానికి కొత్త ఆలోచనలు దోహదపడతాయని చెప్పారు. పరిశోధనలతోనే వైజ్ఞానిక ప్రగతి మెరుగుపడుతుందన్నారు. పరిశోధనల వైపు విద్యార్థుల దృష్టిని మళ్లించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. అనంతరం పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్ అవార్డుకు ఎంపికకావడంతో అభినందనీయమన్నారు. ఉపాధ్యాయులను సత్కరించారు. ఆయన వెంట ఎంఈఓ మహేశ్వరరావు ఉన్నారు. చివరిగా ఎమ్మార్సీని పరిశీలించి సూచనలు సలహాలు అందించారు.

వేలం ఆదాయం రూ.39.27 లక్షలు

పుత్తూరు: పుత్తూరు దినసరి కూరగాయల మార్కెట్, ప్రైవేటు బస్టాండ్, జంతువధశాలకు బుధవారం నిర్వహించిన బహిరంగ వేలంపాట ద్వారా రూ.39.27 లక్షలు మున్సిపాలిటీకి ఆదాయం సమకూరినట్లు కమిషనర్ కెఎల్ఎన్‌రెడ్డి తెలిపారు. దినసరి కూరగాయల మార్కెట్‌ను సి.భానుప్రియ రూ.19.51 లక్షలకు దక్కించుకోగా, ప్రైవేటు బస్టాండ్‌ను ఏ.లోకనాథం రూ.14.89 లక్షలకు, జంతువధశాలను ఎన్.సుబ్రమణ్యం రూ.4.87 లక్షలకు వేలంపాటను దక్కించుకున్నట్లు వెల్లడించారు. వేలం హెచ్చుపాటదారుల వివరాలను కౌన్సిల్ సమావేశంలో ఆమోదం కోరనున్నట్లు తెలిపారు. అనంతరం గుత్తేదారులు మున్సిపాలిటీ నిబంధనలకు లోబడి ఏప్రిల్ 1 నుంచి రుసుం వసూలు చేయాలని స్పష్టం చేశారు.

తపాలా సేవలను సద్వినియోగం చేసుకోండి



ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

పుత్తూరు: మారుమూల గ్రామాలకు సైతం విస్తరించిన తపాలా శాఖ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆ శాఖ అసిస్టెంట్ సూపరింటెండెంట్ కె.ఆర్ముగం కోరారు. బుధవారం వడమాలపేటలో డాక్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తపాల శాఖలో ఖాతాలు ప్రారంభించడం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని పొందవచ్చని వివరించారు. కేవలం రూ.399 చెల్లించిన వ్యక్తి ఏడాదిలోపు ఏదైనా ప్రమాదంలో మృతి చెందితే రూ.10 లక్షల బీమా మొత్తాన్ని నామినీకి చెల్లించడం జరుగుతుందని తెలిపారు. నెలవారి నగదు డిపాజిట్లు చేసుకోవచ్చని తెలిపారు. అలాగే పొదుపు ఖాతా, జీవిత బీమా వంటి సౌకర్యాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో పోస్ట్ మాస్టర్లు కిషోర్, వెంకమరాజు, శేఖర్ ప్రసాద్, రమణ, భాస్కర్‌రాజు, దేవప్రసాద్, సమీర్ పాల్గొన్నారు.

పల్స్‌పోలియోపై అవగాహన ర్యాలీ



ర్యాలీ చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

పాలసముద్రం : అప్పుడే పుట్టిన బిడ్డ మొదలు ఐదేళ్లలోపు చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేయడానికి కార్యక్రమాన్ని విజయవంతం పీహెచ్‌సీ వైద్యాధికారి మోహన్‌కృష్ణ తెలిపారు. బుధవారం పాలసముద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య సిబ్బందికి, అంగన్‌వాడీ కార్యకర్తలకు పల్స్‌పోలియో కార్యక్రమంపై సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మోహన్‌కృష్ణ మాట్లాడుతూ మండల పరిధిలో 0-5 సంవత్సరాలోపు 2767 మంది పిల్లలు ఉన్నారని, వీరికి పోలీయో చుక్కలు వేయాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ జ్ఞానశేఖర్, సూపర్‌వైజర్ మురళి, సుశీల, ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వెదురుకుప్పంలో..

వెదురుకుప్పం: మార్చి 3న జరిగే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ పురుషోత్తం అన్నారు. బుధవారం మండలంలోని పచ్చికాపల్లం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పల్స్‌పోలియో నిర్వహణపై సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని పల్స్ పోలియో కేంద్రాల పరిధిలో ఉన్న పిల్లలకు పోలియో చుక్కలు వేయాలన్నారు. మొబైల్ పోలియో కేంద్రాల ద్వారా కూడా పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని చెప్పారు. సమావేశంలో వైద్యాధికారిణి సురేఖ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యతగా పని చేయండి



రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

పాలసముద్రం : మండల పరిధిలోని సచివాలయ ఉద్యోగులు బాధ్యతగా పని చేయడంతో పాటు సమయపాలన తప్పక పాటించాలని ఎంపీడీఓ రామనాథరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన పాలసముద్రం సచివాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజల సమస్యల పరిష్కారం కోసం గ్రామ సచివాలయాలు వ్యవస్థను తీసుకొచ్చిందన్నారు. అనంతరం ఆయన ఇంతవరకు ప్రజల నుంచి అందిన ఫిర్యాదులు, పరిష్కరించినవి ఎన్ని అని పంచాయతీ కార్యదర్శి ధరణిని అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో డిజిటల్ అసిస్టెంట్ శివ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.